
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 17 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.22
సహరీ (సోమ) ఉ.4.48

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	38	26



మోగిన భేరీ!





- లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు షెడ్యూల్ ప్రకటన
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్.. మే 13న పోలింగ్
- జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు 5,18,195 మంది
- ఇందులో పురుషులు 7,52,909, మహిళలు 1,01,567
- జిల్లావ్యాప్తంగా 1644 పోలింగ్ కేంద్రాలు.. 11 వేల మంది సిబ్బంది
- ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం
- వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా
- జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలు
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ హెచ్చరికలు

అమలాపురం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాల్గో విడతలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీనిలో భాగంగా జిల్లా పరిధిలోని అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీకానుంది. ఆరోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 25తో ముగుస్తుంది. స్క్రూట్నీ ఏప్రిల్ 26న, నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీతో ముగియనుంది. ఎన్నికల మే 13న పోలింగ్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4న జరుగుతుందన్నారు. శనివారం నుంచే ఎన్నికల ప్రవర్త నియమావళి అమలులోకి వచ్చిందని, ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. కాగా జిల్లాలో లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జిల్లాలో 15,18,195 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 7,52,909, మహిళలు 7,65,266, ఇతరులు 20 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గంలో 2,50,029 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా రాజోలు నియోజకవర్గంలో 1,96,201 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా... రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 2,01,428 మంది ఓటర్లు ఉండగా పురుషులు 99,861, మహిళలు 1,01,567 మంది, ముమ్మిడివరంలో 2,42,804 మంది ఓటర్లుకుగాను పురుషులు 1,20,923, మహిళలు 1,21,881, అమలాపురంలో 2,11,804 మంది ఓటర్లుకు గాను పురుషులు 1,05,503, మహిళలు 1,06,300 మంది, రాజోలులో 1,96,201 మంది ఓటర్లుకుగాను పురుషులు 96,971, మహిళలు 99,229, ఇతరులు 1, పి.గన్నవరంలో 1,97,048 మంది ఓటర్లకు గాను పురుషులు 99,226, మహిళలు 97,816, ఇతరులు ఆరుగురు ఉన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2,50,029 మంది ఓటర్లకు గాను పురుషులు 1,24,000, మహిళలు 1,26,023 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో 2,18,881 మంది ఓటర్లకుగాను పురుషులు 1,06,425, మహిళలు 1,12,450 మంది, ఇతరులు ఆరుగురు ఓటర్లు ఉన్నారు. ఇక ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో 1644 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 239, ముమ్మిడివరంలో 268, అమలాపురంలో 235, రాజోలులో 205, పి.గన్నవరంలో 212, కొత్తపేటలో 262, మండపేటలో 223 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల సమయంలో 18, 19 సంవత్సరాల వయసు కలిగిన మొత్తం 33,201 మంది కొత్త ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 40శాతం దివ్యాంగత్వం కలిగిన ఓటర్లు 25,963 మంది ఉన్నారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటుచేశారు. వాటికి అనుబంధంగా పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి తొలగిస్తున్నట్టు లిఖిత పూర్వకమైన ఆదేశాలు వచ్చేవరకు కోడ్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా స్పష్టంచేశారు. అయితే ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులైనా సీవిజిల్ యాప్ ద్వారా లేదా 1950 నంబరుకు లేదా 1800425532 నంబరుకు ఫిర్యాదు చేసేవిధంగా కంట్రోలు రూములు ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం 11 వేల మంది సిబ్బంది అవసరమవుతారని కలెక్టర్ పేర్కొన్నారు.



కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారుల నియామకం..

అమలాపురం పార్లమెంటు నియోజకవర్గానికి కలెక్టర్ హిమాన్షుశుక్లా రిటర్నింగ్ అధికారిగా నియమించారు. సెల్ 8977935211. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌ను నియమించారు. సెల్ 9618415521. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ వి.మధుసూధనరావును నియమించారు. సెల్ 8977935812. అమలాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, సెల్ 9849903866. రాజోలు రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్‌ను నియమించారు. సెల్ 8977935212. పి.గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా జడ్పీసీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తిని నియమించారు. సెల్ 9490499695. కొత్తపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా జీవీవీ సత్యనారాయణ, సెల్ 9154983101, మండపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ డీవీఎస్ ఎల్లారావును నియమించారు. సెల్ 7799219259.

రాజకీయ నాయకుల బ్యానర్లు తొలగించాలి..

జిల్లాలో మూడు రకాల ఆస్తులుంటాయి. ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేటు ఆస్తులుగా వాటిని విభజించారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ఆస్తులు, ప్రైవేటు ఆస్తులపై రాజకీయ నాయకుల బ్యానర్లు, కటౌట్లను వెంటనే తొలగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రవర్తనా నియమావళిని అనుసరించి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో అనాథరైజ్డ్‌గా రాజకీయ నాయకుల హోర్డింగులు, కటౌట్లు, ఫ్లెక్సీలు లేకుండా రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తలు పాటించాలి. ప్రైవేటు ఆస్తులపై కూడా ప్రసార సంబంధమైన ఫ్లెక్సీలు, కటౌట్లు ఉండరాదు. మండల స్థాయిలో ఎంపీడీవోలు మోడల్ కోడ్ అమలు అధికారిగా వ్యవహరిస్తారు. నిధులు మంజూరై ఇప్పటివరకు చేపట్టని పనులను ప్రస్తుతం ప్రారంభించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ప్రతీ మండలానికి నియమించాం. ఎన్‌సీసీ కోడ్ ఉల్లంఘనలపై కంట్రోల్ రూమ్‌కు, సీవిజిల్ యాప్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. కులం, మతం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా ప్రకటనలు లేకుండా జాగ్రత్తలు వహించాలి. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు మినహా ఏ రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా తాత్కాలికంగా మూసివేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో జేసీ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, డీపీఆర్వో లక్ష్మీనారాయణరెడ్డిలు పాల్గొన్నారు.



మలికిపురంలో విగ్రహానికి ముసుగు వేయిస్తున్న పంచాయతీ సిబ్బంది



వైసీపీ జెండాను శనివారం మండపేట రాజారత్న సెంటరులో నుంచి తొలగిస్తున్న సచివాలయ ఉద్యోగి

ఎన్నికల నిబంధనలు తక్షణం అమలులోకి

మలికిపురం, మార్చి 16: ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చాయని ఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని మలికిపురం ఎంపీడీవో ముత్యం వీరాస్వామి నాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ తదితర ఉద్యోగులకు ఎన్నికల నియమావళి గురించి వివరించారు. మలికిపురం సెంటర్‌లో విగ్రహాలకు ముసుగులు వేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శ్రీహరి, వీఆర్వో హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 19న యానాంలో పోలింగ్

యానాం, మార్చి 16: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. అలాగే పుదుచ్చేరికి సంబంధించి పుదుచ్చేరి రాష్ట్ర ఎన్నికల అధికారి కులంతు గాన్ ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన ఉత్తర్వుల మేరకు పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి మొదటి దఫాలో ఎన్నిక జరగనుంది. దీనికి సంబంధించి నోటిఫికేషన్‌ను మార్చి 20న విడుదల చేయడం జరుగుతుంది. 20వ తేదీ నుంచి 27 వరకు నామినేషన్లు స్వీకరణ, 28న నామినేషన్లు పరిశీలన, 30న నామినేషన్ల ఉపసంహరణ, 19న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుంది. శనివారం నుంచే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ప్రచార పర్వంపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించనుంది.



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో జనసేన కార్యకర్తల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న పితాని బాలకృష్ణ

జనసేన శ్రేణుల ఆందోళనలు

అమలాపురం(ఆంధ్రజ్యోతి)/ముమ్మిడివరం, మార్చి16: టిక్కెట్ల కేటాయింపుపై రగడలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈసారి రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో జనసేనకు చెందిన పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. అమలాపురం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకే కేటాయించి, జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబుకు ప్రాధాన్యత కల్పించాలంటూ గడియార స్తంభం సెంటర్‌లో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసులు ఆందోళన విరమించాలని కోరడంతో జనసేన నేతలు, కార్యకర్తలు గడియార స్తంభం నుంచి ముమ్మిడివరం గేటు, సినిమా రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు. నారాయణపేటలోని పార్టీ కార్యాలయం వద్ద ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని హంగామా సృష్టించాడు. కాగా రాజోలు టిక్కెటు ఆశించిన జనసేన నేత బొంతు రాజేశ్వరరావు వర్గీయులు పెద్దసంఖ్యలో మలికిపురం పురవీధుల్లో ఆందోళనకు దిగారు. స్థానికుడైన రాజేశ్వరరావుకు టిక్కెట్ ఇవ్వాలని, దేవ వరప్రసాద్ గోబ్యాక్‌అంటూ పెద్దపెట్టున ఆందోళన చేశారు. అటు ముమ్మిడివరంలో కూడా జనసేనలో అసంతృప్తి జ్వాలలు రగుతులున్నాయి. ముమ్మిడివరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణకు జనసేన నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఓదశలో బాలకృష్ణ కంటతడి పెట్టారు.

అమరజీవి ఆశయ సాధనకు కృషి చేయాలి : కలెక్టర్

అమలాపురం టౌన్, మార్చి16: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం తాగ్యం చేసిన మహనీయుడు, అమరజీవి పొట్టిశ్రీరాములు అని కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని కలెక్టరేట్‌లో శనివారం అధికారికంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్, ఎస్పీ ఎస్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అడ్మిన్ ఎస్పీ షేక్ ఖాదర్‌బాషాలు పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింసలతోపాటు హరిజనోద్ధరణ కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడు శ్రీరాములు అన్నారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయనే మూలమన్నారు. ఆయన సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ఫ్యాన్‌కు పాత రెక్కలే..



పినిపే విశ్వరూప్ | పొన్నాడ సతీష్‌కుమార్ | విప్పర్తి వేణుగోపాల్ | గొల్లపల్లి సూర్యారావు | చిర్ల జగ్గిరెడ్డి | తోట త్రిమూర్తులు | పిల్లి సూర్య ప్రకాష్

ప్రజలు వ్యతిరేకించినా.. మళ్లీ సిట్టింగ్‌లకే..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో అధికార వైసీపీ ఎట్టకేలకు అభ్యర్థులను ప్రకటించింది. ఓటమి భయంతో ఇన్నాళ్లు అనేక స్థానాల్లో ఎవరు బరిలో ఉంటారో తేల్చలేక సతమతమైన ఫ్యాన్ పార్టీ పలు స్థానాల్లో రాజీపడింది. అక్కడ అభ్యర్థులను మార్చాలని భావించినా ఎక్కడ మళ్లీ కొత్త తలనొప్పులు వస్తాయోనన్న భయంతో కొంత తగ్గింది. చేసేదిలేక అనేక స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే దాదాపు మొగ్గు చూపింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 19 అసెంబ్లీ, పశ్చిమ నుంచి కొత్త తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన మూడు స్థానాలు వెరసి మొత్తం 22 స్థానాలకు ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పి.గన్నవరం స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలను తప్పించి వారి స్థానాల్లో కొత్త అభ్యర్థులను బరిలో నిలబెట్టింది. ముగ్గురు మంత్రుల్లో ఒకరిని రామచంద్రపురం నుంచి తప్పించి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీలోకి దింపింది. మిగిలిన ఇద్దరు మంత్రులు విశ్వరూప్, దాడిశెట్టి రాజా యథాతథంగా వారి స్థానాల్లోనే బరిలో ఉన్నారు. మంత్రి విశ్వరూప్‌ను మార్చాలని ప్రయత్నించినా ప్రత్యామ్నాయం లేక తిరిగి ఆయన్నే కొనసాగించింది. రాజోలు స్థానంపై మరోసారి పునరాలోచించాలని ఎమ్మెల్యే రాపాక తిరగబడ్డా వైసీపీ పట్టించుకోలేదు. కాకినాడ జిల్లాలో వైసీపీ ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకుండా మొత్తం ఓసీలతో నింపేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. వెరసి రంపచోడవరంతోపాటు మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలో మొత్తం 21 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేయగా 10 మంది అభ్యర్థులు కాపు సామాజిక వర్గం నుంచి ఉన్నారు. మూడు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అమలాపురం సిట్టింగ్ ఎంపీ అనురాధకు మొండిచేయి చూపింది.

బీసీలకు అన్యాయమే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 22 స్థానాల్లో అధికార వైసీపీ మెజార్టీ సీట్లు ఓసీలకే కట్టబెట్టింది. మాట్లాడితే నా ఎస్సీలు, నా బీసీలు అంటూ మాటలు వల్లె వేసే వైసీపీ అధ్యక్షుడు జగన్ సీట్ల కేటాయింపులో మాత్రం సామాజిక సమతూకం పెద్దగా పాటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాతినిధ్యం పెంచాలని డిమాండ్లు వచ్చినా వైసీపీ పెద్దగా పట్టించుకోలేదు. మొత్తం 22 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేశారు. సగానికిపైనే సీట్లు కట్టబెట్టారు. ఓసీలకు ఇచ్చిన 12 సీట్లలో పది మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచే ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సీట్లు ఉండగా అన్నీ ఓసీలకే కట్టబెట్టారు. ఇందులో ఆరు సీట్లు కాపు సామాజికవర్గం నుంచి ఒక సీటు రెడ్డి సామాజికవర్గం నుంచి ఉన్నాయి. వాస్తవానికి కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లు టీడీపీ బీసీలకు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను టీడీపీ నిలబెట్టింది.కానీ వైసీపీ ఒక్కరికీ చోటు కల్పించలేదు. ఈ సారి అదే విధానం పాటించి బీసీలకు అన్యాయం చేసింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంలో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. తద్వారా మొత్తం 22 సీట్లలో 12 మంది ఓసీలు, అయిదు స్థానాలు ఎస్సీ, నాలుగు స్థానాల్లో మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం కల్పించింది.

- ఉమ్మడి జిల్లాలో 22 సీట్లు ప్రకటన
- నాలుగు స్థానాల్లో సిట్టింగ్‌లు ఔట్
- మిగిలిన సీట్లలో సిట్టింగ్‌లకే ఛాన్స్
- ముగ్గురు మంత్రుల్లో ఒకరి స్థానం మార్పు
- 12 స్థానాల్లో ఓసీలను నిలబెట్టిన వైసీపీ
- ఎస్సీలకు 5, బీసీలకు 4 స్థానాలే
- కాకినాడ పార్లమెంట్‌లో బీసీలకు నో ఛాన్స్
- రాజోలు సీటుపై రాపాక గోడు వినని వైసీపీ
- ఎంపీగా అయిష్టంగానే బరిలోకి
- ఆలస్యంగా వచ్చిన గొల్లపల్లికి టిక్కెట్
- రాపాకకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- అమలాపురం ఎంపీకి అవమానం
- ఎక్కడా టిక్కెట్ కేటాయించని వైసీపీ

వెంటాడుతున్న ఓటమి భయం..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక, నియంతృత్వ విధానాలతో పాలన సాగించింది. ఒక పక్క పన్నుల వాత.. మరోపక్క నవరత్నాల పేరుతో లబ్ధిదారుల్లో కోత జనాలను అడుగడుగునా మోసం చేసింది. దీనికితోడు ఎక్కడికక్కడ అధికారపార్టీ నేతల విచ్చలవిడి అవినీతి, బెదిరింపులు, దందాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. ఉద్యోగుల విషయంలోనూ వారిని నానా వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో వైసీపై పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో విసుగొచ్చేసింది. ఎన్నికలు దగ్గరపడ్డ తరుణంలో పార్టీ ఎమ్మెల్యేలు భారీగా ఓడిపోతారనే భయం అధికార పార్టీని వెన్నాడింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఐప్యాక్ సర్వేల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తేలింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను సర్వే పేరుతో పక్కన పెట్టడం మొదలుపెట్టింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఓడిపోతారంటూ వారిని తప్పించింది. అందులో భాగంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, అమలాపురం పార్లమెంట్ పరిధిలో పి.గన్నవరం స్థానాల్లో ఎమ్మెల్యేల టిక్కెట్లు చింపేసింది. వారి స్థానాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అయితే వీరిపైనా వ్యతిరేకత పెద్దగా తగ్గలేదని తేలడంతో తలపట్టుకుంది. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంకావడంతో ఆయన్ను తప్పించాలనుకుంది. విశ్వరూప్, ఆయన తనయుడిని తాడేపల్లికి పిలిపించుకుని పార్టీ పెద్దలు మాట్లాడారు. తనకు సీటు ఖాయమైపోయిందని విశ్వరూప్ తనయుడు ప్రచారం చేసుకోవడంతో నియోజకవర్గంలో విబేధాలు మొదలయ్యాయి. తీరా ఇవి ఎక్కడి వరకు పోతాయో తెలియక చేసేదిలేక మళ్లీ విశ్వరూప్‌నే కొనసాగించింది. రామచంద్రపురం సీటు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వేణుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని సర్వేలో తేలింది. అదే సమయంలో టిక్కెట్ తమకు ఇవ్వాలంటూ ఎంపీ బోస్ పట్టుబట్టారు. లేదంటే పార్టీని వీడిపోతానని సంకేతాలు పంపారు. మంత్రి వేణు అవినీతిపై జగన్‌కు బోస్ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వేణును రాజమహేంద్రవరం రూరల్ సీటుకు పంపేశారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌కు ఓటమి తప్పదని సర్వేలో తేలింది. దీంతో ఆయన్ను రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జగన్ బదిలీ చేశారు. అటు కొవ్వూరు ఎమ్మెల్యే వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావును కొవ్వూరుకు సీట్లు మార్చి వ్యతిరేకత తప్పించుకునేందుకు వైసీపీ ప్రయత్నించింది. ఇటు కొత్తపేట, కాకినాడ సిటీ, పెద్దాపురం, జగ్గంపేట, ముమ్మి డివరం స్థానాల్లో అభ్యర్థుల్లో మార్చాలని భావించింది. కానీ అక్కడ పోటీకి దీటైన అభ్యర్థులు లేకపోవడం, మరికొందరు ఎమ్మెల్యేలైతే తమకు టిక్కెట్ నిరాకరించినా, వేరే స్థానానికి మార్చినా పార్టీని వీడిపోతామనే హెచ్చరికలు పంపారు. ఈ నేపథ్యంలో చేసేదిలేక వారిని అయిష్టంగా కొనసాగిస్తూ శనివారం జాబితా వెల్లడించింది. ఇదిలా ఉంటే రాజోలు ఎమ్మెల్యే రాపాక తనకు ఈసారి వైసీపీ నుంచి సీటు ఖాయం అని ఇంత కాలం ధీమాగా ఉన్నారు. తీరా టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి గొల్లపల్లి అనూహ్యంగా అక్కడ టిక్కెట్ దొరక్క వైసీపీలో చేరిపోయారు. ఫలితంగా ఈయనకు వైసీపీ రాజోలు టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో రాపాక భగ్గుమన్నారు. తనను రాజోలు నుంచి తప్పించి అమలా పురం ఎంపీ అభ్యర్థిగా పంపడంపై గుర్రుగా ఉన్నారు. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో తనను ఎంపీ అభ్యర్థిగా పంపి వైసీపీ దగా చేసిందని.. అఖరి నిమిషంలోనైనా తనను రాజోలు పంపాలని కోరినా పార్టీ పట్టించుకోకపోవడంతో కారాలు మిరియాలు నూరుతున్నారు. రంపచోడవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధనలక్ష్మిని తిరిగి కొనసాగించారు. మరోపక్క కాకినాడ ఎంపీగా చలమశెట్టి సునీల్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా గూడూరు శ్రీనివాస్‌ను ప్రకటించారు. అయితే మొత్తం అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులందరినీ ఖరారు చేసినా అనేక మంది నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, సీటు బదిలీపై వచ్చినవారు సొంతపార్టీ కుంపట్లతో తలపట్టుకుంటున్నారు.

వైసీపీ వర్సెస్ టీడీపీ

ఒకపక్క వైసీపీ వెల్లడించిన ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మెజార్టీ స్థానాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా వారిని మార్చలేక అధిష్ఠానం చతికిలబడింది. దీంతో ఇందులో ఎక్కువ స్థానాల్లో ఓటమి తప్పదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క టీడీపీ కూటమి మాత్రం గెలుపు గుర్రాలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 సీట్లలో ఒక్క కాకినాడ సిటీ, అమలాపురం స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన స్థానాల్లో సమర్థవంతమైన అభ్యర్థులతోపాటు సామాజిక సమీకరణాలు పక్కాగా పాటించింది. బీసీలు, ఎస్సీలు, ఓసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ అన్ని వర్గాలను ఆకట్టుకుంది. ఒకపక్క వైసీపీ, మరోపక్క టీడీపీ కూటమి సీట్లపై తొంభై శాతం స్పష్టత వచ్చేసిన నేపథ్యంలో రేపటి నుంచి జిల్లాలో ఇరుపార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు తలపడనున్నారు. ఇక అధికార ప్రతిపక్షాల మధ్య అసలు సిసలు రాజకీయ పోరు ఆరంభం కానుంది.కాగా టీడీపీ కూటమి త్వరలో మూడు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు

కోరుకొండ, మార్చి16: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి దేవస్థానం ముందు ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు, పందిళ్ల నిర్మాణం, ఆలయానికి రంగులు వేయడం, కొండపైన, కొండదిగువున అన్ని నరసింహస్వామి ఆలయాలతో పాటు అన్ని ఉప ఆలయాలకు, దేవతామూర్తులకు, గోపురాలకు రంగులు వేస్తున్నారు. 650 మెట్లకు సున్నాలు వేస్తున్నారు. కొండపైన, మెట్ల మార్గం, కొండ చుట్టూ దేవస్థానం పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామివారు రోజుకో వాహనంలో గ్రామోత్సవం చేస్తారు. ఇందుకుగాను గజ, అశ్వ, ఆంజనేయ, శేష, గరుడ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. కోరుకొండ తీర్థం పేరుతో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యం కలది స్వామి వారి రథోత్సవం. ఈ సందర్భంలో స్వామి వారి అతి పురాతన పెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీసి మరమ్మత్తులు చేస్తున్నారు. రథానికి అమర్చే గుర్రాల బొమ్మలను సిద్ధం చేస్తున్నారు. రాత్రి పగలు సిబ్బంది స్వామి వారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే విధంగా ఆలయ అనువంశిక ధర్మకర్త, దేవస్థానం చైర్మన్ పరానసరరంగరాజ భట్టర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పరిసర గ్రామాల్లో వాల్ పోస్టర్లు అతికించే కార్యక్రమం జరుగుతోంది. రథోత్సవం సందర్భంగా కోరుకొండకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రథం తిరిగే మార్గంలో రోడ్లు, డ్రైన్లు విశాలంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కొండపైన, కొండ దిగువున స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దేవుని కోనేటి వద్ద స్నానాలు చేసే భక్తులు కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కొండపైన దీపాలు వెలిగించే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా స్థానిక రంగరాజస్వామి ఆలయం వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, అధికారుల సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు.


సిద్ధమవుతున్న రథం


అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

అన్నవరం, మార్చి 16: హిందూ దేవాలయాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్లే భక్తుల కోసం నమూనాలయం వద్ద నూతన ప్రసాదం కౌంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఇక్కడ భక్తులు సేదతీరేందుకు ప్రత్యేక వాతావరణం కల్పిస్తున్నామని దీనికి సుమారు రూ.4 కోట్లు వ్యయమవుతుందని అన్నారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాదం ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటిని ఈవో అందజేశారు. అనంతరం ఆయన సత్యదేవుని దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఇటీవల ప్రసాద్ స్కీం నిధులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన అన్నదాన భవన నిర్మాణ స్థలం వద్ద కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో చైర్మన్ ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు, ఇంజనీరింగ్ అధికారులు నరసింహారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి


పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

పెద్దాపురం, మార్చి 16: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,70,530 అన్నదాన విరాళాలు ద్వారా రూ.38,309 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 6,920, తులాభారం ద్వారా రూ.350 వెరసి రూ.3,16,109 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట


తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, మార్చి 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.3975 లక్షలు లభించినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

సర్వర్ల మొరాయింపు.. భక్తుల ఇక్కట్లు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సర్వర్లు మొరాయించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయడంతో సర్వర్లు ఒక్కసారిగా పనిచేయకపోవడంతో భక్తులు ఇక్కట్లకు గురయ్యారు. ఆన్‌లైన్ దర్శన టిక్కెట్లు, లడ్డూ ప్రసాద టిక్కెట్లు కోసం క్యూలైన్ల ద్వారా గంటల తరబడి వేచి ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ఆఫ్‌లైన్లలో ఏర్పాట్లు నిర్వహించారు. స్వామివారి దర్శనం, లడ్డూ ప్రసాదాల కోసం భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఆలయ స్వర్ణ శిఖర ప్రతిష్ఠ పూజలు

ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన ఆలయ పండితులు

తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వర్ణశిఖర ప్రతిష్ఠా పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రోత్సాహంతో దాతలు ముందుకు వచ్చి రూ.35 లక్షలతో స్వర్ణశిఖరాలను సమర్పించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకళశారాధన, కుంభ ఆవాహన, శిఖరగర్త సంప్రోక్షణ, శిఖర అభిషేకం, సాయంత్రం అష్టోత్తర కలశారాధన, పంచసయ్యాదివాసం, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలలో శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఉదయం ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్, దాతల కుటుంబ సభ్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 16: రామచంద్రపురంలో జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, బిక్కవోలు, అనపర్తి, మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల పరిధికి సంబంధించి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఏర్పాటుకు న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి జి.సత్యప్రభాకరరావు జీవో ఎం.ఎస్ నెం.53ను శుక్రవారం జారీ చేశారు. జిల్లా కోర్టు ఏర్పాటుకు జిల్లా జడ్జి, ముఖ్య పరిపాలనాధికారి, పర్యవేక్షకుడు, ట్రాన్స్‌లేటర్, సీనియర్ సహాయకుడు, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 1, జూనియర్ సహాయకులు 5, టైపిస్టులు 3, అమీనాలు 3 ఇలా మొత్తం 31 పోస్టులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లాకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.ఎస్.ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, కోశాధికారి జె.ఎస్.ఎస్.చక్రవర్తి, మహిళా ప్రతినిధి కె.సత్యవాణి, జూనియర్ ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హైవేపై రెండు కార్ల ఢీ


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మార్చి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి వస్తున్న కారు 216 జాతీయ రహదారిపై భోగాపురం జంక్షన్ వద్ద ప్రత్తిపాడు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా, వాడపల్లి దర్శనం ముగించుకుని విశాఖపట్నం వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ప్రత్తిపాడు వైపు వెళుతున్న కారు వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. బాలుడితో పాటు మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వారిని హైవే పోలీసులు అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు ఆర్థ్రోప్లాస్టీ సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: స్థానిక ఆర్యాపురం సాయి హాస్పిటల్‌లో రాజమండ్రి ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరి ఆర్థ్రోప్లాస్టీ సదస్సును నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.విజయకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిపుణులైన వైద్యులు ఈ సదస్సుకు హాజరై కీళ్ల మార్పిడి సర్జరీల్లో మెలకువలు, కొత్త పోకడలు, నైపుణ్యాల పెంపునకు అవసరమైన పరిజ్ఞానాన్ని వివరిస్తారన్నారు. అలాగే వారు గోదావరి జిల్లాల వైద్యులతో ముఖాముఖి చర్చించి ఆధునిక విధానాలను తెలియజేస్తారని చెప్పారు. సదస్సుకు కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి డాక్టర్ పి.ధనశేఖర్ రాజా, ఆస్టర్ ఆసుపత్రి డాక్టర్ జేవీ శ్రీనివాస్ హాజరవుతారని విజయకుమార్ తెలిపారు.

పంట కాల్వలో మొసలి?




అమలాపురం రూరల్, మార్చి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈదరపల్లి ప్రధాన బెండా కెనాల్‌లో శనివారం మధ్యాహ్నం మొసలి ప్రత్యక్షమైందన్న సమాచారం అందరిలోను భయాందోళనకు గురి చేసింది. ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన పంటకాల్వలో మొసలి గట్టుపైకి ఎక్కుతుండగా అవతలి ఒడ్డున ఉంటున్నవారు సెల్‌ఫోన్లో ఫొటోలను తీశారు. గట్టుపైకి ఎక్కిన మొసలిని గుర్తించేందుకు స్థానికులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే అవతలి నుంచి ఫొటోలు తీసి ఇవతలి గట్టుకు వచ్చేసరికి మొసలి తిరిగి పంటకాల్వలోకి వెళ్లిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. మొసలిని ప్రత్యక్షంగా చూసామని స్థానిక మహిళలు చెబుతున్నారు. అయితే అది మొసలి కాదని ఉడుము అయి ఉండవచ్చునని కొందరు చెబుతున్నప్పటికీ ఉడుము అంత పెద్ద ఆకారంలో ఉండే అవకాశం లేదని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా జాగ్రత్తగా ఉండాలని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకం

నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి16 : కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నన్నయ తెలుగు శాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ 1921 సంవత్సరంలో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన మాకొద్దీ తెల్లదొరతనం గేయానికి భిన్నంగా నల్లదొరలు పాలన వచ్చినంత మాత్రాన హరిజనులకు ఒరిగేదేమీ ఉండదని నిర్మోహమాటంగా మాకొద్దీతెల్లదొరతనం ప్రతిగేయం రాసిన తొలిదళిత విప్లవకవి కుసుమ ధర్మన్న అని కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్ సామాజిక ఆత్మగౌరవం, చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ప్రసంగించారు. కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కుసుమ ధర్మన్న విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. కుసుమ ధర్మన్న కళా పీఠంచే సాహితీ సేవా పురస్కారాన్ని నన్నయ తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణకు వీసీ ప్రదానం చేశారు. 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణలతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై జాతీయ స్థాయిలో 53 మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, ఆంధ్ర విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి ర్యాలి శ్రీనివాసు, కందుకూరి వీరేశలింగం కళాశాల శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు, నన్నయ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కె.వి.ఎన్.డి.వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.


కుసుమ ధర్మన్న సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు!

ఎన్నికల కోడ్ రాక ముందే అధికార పార్టీ నేతల హడావిడి


ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


అసంపూర్తిగా మిగిలిన ఆలయం పనులు

తుని రూరల్, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల అవుతున్న తరుణంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు హడావిడిగా శంకుస్థాపనలు చేయడం మొదలుపెట్టారు. అలాగే పనులు పూర్తి కాకపోయినా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. లోవ దేవస్థానం ప్రధాన గోపురం పనులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పనులు నిరాటంకంగా కొనసాగితే మరో రెండు నెలలకు కానీ పూర్తవ్వవు. ఈ లోపు ఎన్నికలు వచ్చేయడంతో హడావిడిగా ప్రారంభోత్సవానికి ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి చకచకా ఏర్పాట్లు చేశారు. కోడ్ అమలుకు నాలుగు గంటల ముందే దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయానికి చేరుకుని స్థానిక వైసీపీ నాయకులు, ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆలయ నిర్మాణంలో ఉన్న శ్లాబ్‌కు ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్రలను అత్యవసరంగా తొలగించి ఆలయానికి పక్కాగా ఏర్పాటు చేయాల్సిన తలుపులకు బదులు డమ్మీ తలుపులు ఏర్పాటు చేసి హడాహుడిగా ఆలయాన్ని ప్రారంభించడం పట్ల భక్తులు దుమ్మెత్తి పోస్తున్నారు. పనులు పూర్తయ్యాక శాస్త్రోక్తంగా జరగాల్సిన కార్యక్రమం హడావిడిగా చేయడం ఏమిటని పలువురు పండితులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం భారీగా కేసులను పరిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో ఏర్పాటు చేసిన బెంచ్‌లలో క్రిమినల్ 1013, సివిల్ 379 కలిపి మొత్తం 1513 కేసులకు పరిష్కారం చూపించారు. సుమారు రూ.2,30,00,000 పరిహారాన్ని ఆయా సంస్థల ద్వారా బాధితులకు అందజేసేలా అవార్డులు ప్రకటించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో విచారణలో ఉన్న ఒక రోడ్డు ప్రమాదం కేసు (ఎంవీఓపీ 316/2021)కు సంబంధించి బాధితురాలికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.1,12,00,000 పరిహారాన్ని అందజేసే విధంగా పరిష్కారం చూపారు. బాధితురాలి సమస్యకు సత్వర న్యాయం అందజేయడంలో చొరవ చూపిన డీఎల్ఎస్ఏకి, ఆమె న్యాయవాదులు ఎస్‌జీ శంకర్, కె.నరసింహారావు, బీమా సంస్థ న్యాయవాది దునే శ్రీనివాసరావు, చోళ మండలం బీమా సంస్థకు పీడీజే సునీత అభినందనలు తెలిపారు.

బదిలీ అయ్యారు..వెంటనే తిరిగొచ్చారు

రాజమహేంద్రవరంరూరల్; మార్చి 16: వడ్డించే వాడు మనవాడైతే బంతిలో చివర కూర్చున్న అందుతుంది అంటారు.. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ బదిలీ అంశాన్ని పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. డా. బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం రెగ్యులర్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ రాజమహేంద్రవరం రూరల్ మండలం ఎంపీడీవోగా శ్రీనివాసరావు ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు. భారతీయ ఎన్నికల సంఘం (ఈసీఐ) గైడ్‌లైన్స్ ప్రకారం పంచాయతీ రాజ్ కమిషనర్(పీఆర్‌అండ్‌ఆర్‌డీ) తాడేపల్లి, కోనసీమ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఎంపీడీవో శ్రీనివాసరావును డిప్యూటేషన్ రద్దు చేస్తూ అంబాజీపేట ఎంపీడీవోగా చార్జి తీసుకోవాలంటూ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న డి. బాబూరావును ఎంపీడీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే 24 గంటలు గడవక ముందే అంబాజీపేట నుంచి తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో కీలకపాత్ర పోషించి అధికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలు, ఆయన మెప్పును పొందారని, దీంతో ఎలక్షన్ కమిషన్ నిబంధనలు కూడా పక్కన పెట్టి శ్రీనివాసరావు తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి రావడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం సొమ్ము కోసం రైతుల ధర్నా


ఆందోళన చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేటి వరకు సొమ్ములు చెల్లించకపోవడంతో రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం ఆధ్వర్యంలో సుమారు 50 మంది రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో రైతులు, నాయకులు మాట్లాడుతూ నామమాత్రంగా కొందరికి మాత్రమే సొమ్ములు చెల్లించారని ఇంకా రూ.కోట్లలో బకాయి ఉందని అన్నారు. వ్యవసాయశాఖ అధికారి రమేష్ నాయుడుకు వినతిపత్రం అందించారు. అయితే వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చినా, ధర్నా నిర్వహించినా తమ సమస్య పరిష్కారం అయ్యేలా లేదని రైతులు అనుకుని సోమవారం రంపచోడవరం వెళ్లి అక్కడ అధికారులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు.

రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

రావులపాలెం, మార్చి 16: సోమవారంనుంచి29వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పి.శ్రీనివాసరాజు తెలిపారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో బాలురు 297, బాలికలు 312, ప్రవేట్ పాఠశాలలో బాలురు 292, బాలికలు220 వెరశి 1121మంది, సప్లమెంటరీ విద్యార్థులు 171మంది పరీక్షలకుహాజరవుతారన్నారు. జడ్పీహైస్కూల్ ఊబలంక, రావులపాలెంజడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో 2సెంటర్లు, బాలికపాఠశాల, దేవరపల్లి పాఠశాల, గోపాలపురం ఉన్నతపాఠశాలలో ఏర్పాట్లు చేశామన్నారు.

మత ప్రాతిపదికన ప్రజలను విడగొట్టేందుకే సీఏఏ

వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



గడియార స్తంభం సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

అమలాపురం టౌన్, మార్చి 16: మత ప్రాతిపదికన దేశ ప్రజలను విడగొట్టేందుకు మతోన్మాద బీజేపీ తీసుకువచ్చిన సీఏఏను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండుచేస్తూ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆండ్ర మాల్యాద్రి, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోకేశ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం అమలు కోసం నిబంధనలు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశ సమైక్యతకు భంగం కలిగించే సీఏఏ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. సీఏఏ, ఎన్ఆర్సీలను రద్దు చేయాలని సీపీఎం, వీసీకే, ఆర్పీఐ, కాంగ్రెస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పలువురు వక్తలు మాట్లాడారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ప్రజలంతా ఓడించాలని పిలుపునిచ్చారు. నిరసనలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, కాంగ్రెస్ నాయకుడు కుడుపూడి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుదే దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, పాము బాలయ్య, బళ్ల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

కలలకు రెక్కల్లో చేరండి

డాక్టర్ సత్యశ్రీ పిలుపు



కలలకు రెక్కలు పథకంపై అవగాహన కల్పించిన డాక్టర్ సత్యశ్రీ

అమలాపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే ఆడపిల్లలకు అన్నివిధాలా రక్షణ ఉంటుందని, ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని టీడీపీ నాయకురాలు డాక్టర్ సత్యశ్రీ పేర్కొన్నారు. శనివారం అమలాపురం, మలికిపురంలో పర్యటించిన ఆమె వివిధ కళాశాలల్లో విద్యార్థినిలతో భేటీ అయ్యారు. కలలకు రెక్కలు పథకం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, మీ విద్యా రుణానికి ఇకపై టీడీపీ గ్యారంటీ ఇస్తుందని, కోర్సు పూర్తి చేసుకునే వరకు తీసుకున్న రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందంటూ ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ఉన్న యువతులంతా కలలకు రెక్కలు పథకానికి సంబంధించి తమ పేర్లను 9261292612లకు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈపథకం వల్ల విద్యార్థినులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఏరియాఆసుపత్రి పర్యవేక్షకుడిగా డా.ప్రవీణ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి16: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా.ఎస్.ప్రవీణ్‌ను నియమిస్తూ జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త ఉత్తర్వులు జారీచేశారు. డా. ప్రవీణ్ గతంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసి సెలవుపై వెళ్లారు. అప్పట్లో డా. వీరభద్రుడును ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. సెలవు అనంతరం డా. ప్రవీణ్ విధుల్లో చేరారు. సీనియార్టీ ప్రకారం పర్యవేక్షకుడిగా నియమించాలని ప్రవీణ్ విన్నవించడంతో ప్రవీణ్‌కు సూపరింటెండెంట్‌గా నియమించారు.

భక్తుల తాకిడితో కిటకిటలాడిన అప్పనపల్లి

మామిడికుదురు, మార్చి 16: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 2,984మంది దర్శించుకుని 2,163 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,97,756ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి అనపర్తి మండలం బాపిరాజుపేటకు చెందిన పడాల సత్తిరెడ్డి-పద్మావతి, వెంకటరెడ్డి-ప్రత్యూష, ఆనంద్‌స్వరూప్‌రెడ్డి-కార్తీకలక్ష్మి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. దాతకు సహాయ కమిషనర్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

శనేశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, మార్చి 16: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో భక్తులు శనివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,10,649 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయండి

యానాం, మార్చి 16: యానాంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతికార్యకర్త కృషి చేయాలని సీఎల్పీ లీడర్, పుదుచ్చేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే వైద్యనాదన్ కోరారు. యానాం వచ్చిన ఆయనకు యానాం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, అర్ధాని దినేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. తొలుత స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక హోటల్ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీకి సంబంధించి అనేక అంశాలపై చర్చించారు. సమావేశంలో నాయకులు కాటంశెట్టి రామూర్తి, విళ్ల చిన్ని, మల్లాడి భీరస్వామి, రాముడు రాజు, దవులూరి పతి, చక్రవర్తి, బంగారం తదితరులు పాల్గొన్నారు.

• నియోజకవర్గ అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారి ఎస్‌కే హుస్సేన్ • ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నాయకుల విగ్రహాలకు ముసుగులు

ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి

పి.గన్నవరం, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలతో పాటు అధికారులు ఎన్నికల ప్రవర్తన నియామవళిని విధిగా పాటించాలని నియోజకవర్గ అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారి ఎస్‌కే హుస్సేన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటోతో ఉన్న సర్టిఫికెట్లను జారీ చేయకూడదని రెండు రోజులో సాఫ్ట్‌వేర్ మారుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో త్రిశూలపాణి, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు డి.శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తోలేటి సత్తిబాబు, చిట్టాల రామజోగేశ్వరరావు, బొరుసు శేఖర్, చీకరమల్లి శ్రీనివాసరావు, తాటికాయల శ్రీనివాసరావు, యల్లమిల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఎన్నికల నియమావళి ప్రకారం ఉద్యోగులు పనిచెయ్యాలని అధికారులు సూచించారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, బీఎల్‌వోలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 72గంటల్లోగా అన్ని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలు, ఫ్లెక్సీలు, ప్రభుత్వ ప్రచార బ్యానర్లు తొలగించాలన్నారు. తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, ఎస్ఐ కె.మనోహర్‌జోషీ పాల్గొన్నారు.



మండపేటలో నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్న దృశ్యం

అల్లవరం: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో మండల పరిధిలో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.తహసీల్దారు సునీల్‌కుమార్, ఎస్ఐ జి.హరీష్‌కుమార్‌లు పాల్గొని ఎన్నికల నియామవళిని కచ్చితంగాఅమలు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజామోహన్, హౌసింగ్ ఈఈ మూర్తి, వైద్యాధికారిణి మౌనిక, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఏడుకొండలుపాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయాలని సెక్టార్ అధికారులను రామచంద్రపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ కోరారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, రాజకీయ పక్షాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సహకరించాలని రాజకీయ నేతలను కోరారు.

అంబాజీపేట: రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు, ప్రభుత్వానికి సంబంధించి పథకాలతో ముద్రించిన బోర్డులను తొలగించారు. మండలంలోని 16గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కార్యాలయాల వద్ద ఉన్న శిలఫలకాలను మూసివేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని మండల అధికారులు హెచ్చరించారు. కార్యదర్శులు జీజీవీకే కుమార్, మౌనిక, సత్యవేణి, తాతాజీ, లక్ష్మీపతిలు పాల్గొన్నారు.

మండపేట: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో శనివారం సాయంత్రం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. దేశ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. పెద్దకాల్వ వద్ద గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను, కరాచి సెంటరు వద్ద వంగవీటి రంగా జ్యోతిరావుపూలే, విగ్రహాలను శుక్రవారం స్థానిక నేతలు ఆవిష్కరించారు. షెడ్యూల్ విడుదల కావడంతో వాటికి ముసుగులు వేశారు.

మలికిపురం: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతోఉద్యోగులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పని చేయాలని ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడుఅన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ తదితర ఉద్యోగులకు ఎన్నికల నియమావళి గురించి వివరించారు. మలికిపురం సెంటర్‌లో విగ్రహాలకు ముసుగులు వేశారు. పంచాయతీ కార్యదర్శి బి.శ్రీహరి, వీఆర్వో హరికిషన్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు: బండారు







కొత్తపేట: బిళ్లకుర్రులో బాబుష్యూరిటీ పత్రాలను పంపిణీ చేస్తున్న బండారు సత్యానందరావు, కె.గంగవరం: యండగండిలో చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరితో మాట్లాడుతున్న సుభాష్, మండపేట: వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరికలు

కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు

కొత్తపేట, మార్చి 16: రాష్ట్రంలో ప్రజాపాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. బిళ్ళకూరులో శనివారం బాబుష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ప్రజలు అరాచక పాలన విముక్తి కోసం ఎదురుచూస్తున్నారని సత్యానందరావు అన్నారు. వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలై చెత్తకుప్పలోకి పోవడం ఖాయమని, రాష్ట్రానికి పట్టిన పీడ పోవడానికి సిద్ధంగా ఉందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమానికి టీడీపీ కృషి

ముస్లిం సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడిందని టీడీపీయేనని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామీయా మసీదులో జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మీరాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు. తన తండ్రి సత్యానందరావు ఉమ్మడి అభ్యర్థిగా కొత్తపేట అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారని ముస్లింలు కలిసికట్టుగా విజయానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల మూర్తి, చోడపనీడి భాస్కరరావు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండపేట, మార్చి16: స్థానిక 6వార్డుకు చెందిన కానూరి శివ ఆధ్వర్యంలో పలువురు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, వల్లూరి సాయికుమార్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన చెల్లూరి ఆచారి, చెల్లూరి భద్రం, బట్టా స్వామి, బీరక సూర్యప్రకాష్, పొన్నాడ వెంకటేష్, బట్టా చిన్నలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు, కోళ్ల గోవిందు, బత్తుల గణపతి, కాశిన కాశివిశ్వనాదంపాల్గొన్నారు.

యండగండి, పామర్రులో సుభాష్ పర్యటన

కె.గంగవరం, మార్చి 16: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శనివారం రాత్రి యండగండి, పామర్రు, కూళ్ల గ్రామాల్లో పర్యటించారు. యండగండిలో పార్టీ సీనియర్ నాయకుడు చుండ్రు వివిఎస్ఎస్ చౌదరిని కలసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం చౌదరి ఆధ్వర్యంలో ఆయా సంఘాల పెద్దలను కలిసి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పామర్రు, కూళ్ల గ్రామాల్లో పర్యటించారు. ఆయా సంఘాల నాయకులను కలిశారు. తొలిసారి సుభాష్ మండలానికి రావడంతో ఆయా పార్టీ నాయకులు భారీ స్వాగతం పలికారు. ఈకార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, దేవరపల్లి బుల్లి, పెంకే నాగేశ్వరరావు, పెంకే వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిలేరు పశుపోషణను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఆలమూరు, మార్చి 16: పశుపోషణలో ఆంధ్రా హర్యానాగా పేరుగాంచిన ఆలమూరు మండలం గుమ్మిలేరు పశుపోషణను హర్యానా శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. హర్యానా రాష్ట్రంలోని కర్నాల్ నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జనిటిక్ రీచర్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు డా.కెఎన్.రాజా, డా. సోనికాఅల్వావత్‌లు పుంగనూరు ఆవుల పెంపకంలో పేరుగాంచిన రెడ్డి సత్తిబాబు క్యాటిల్ ఫామ్‌ను సందర్శించారు. దేశవాళీ ఆవుల పరిశోధనలో భాగంగా పుంగనూరు ఆవుల పెంపకం, వాటి వృద్ధి తదితర అంశాలపై వారు రైతు సత్తిబాబు నుంచి వివరాలు సేకరించారు. పుంగనూరు ఆవుల పోషణతోపాటు వాటిని వృద్ధి చేస్తున్న రైతు సత్తిబాబు కృషిని వారు అభినందించారు. ఈపరిశీలనలో ఆలమూరు, రామచంద్రాపురం వెటర్నరీ అసిస్టెంటు డైరెక్టర్లు డా.ఎల్.అనిత, డా.ఒ.రామకృష్ణ, గుమ్మిలేరు పశువైద్యాధికారి సుబాష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోనే ప్రత్యేక గుర్తింపు



అమలాపురం టౌన్, మార్చి 16: తమిళ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసినప్పటికీ తెలుగు చిత్రరంగంలోనే ప్రత్యేక గుర్తింపు లభించిందని ప్రముఖ సినీ నటి సురభి పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి చిత్రంలో నటించాలని ఎంతో కోరికగా ఉండేది. ఆ కోరిక విశ్వంబర చిత్రంతో తీరనుందని పేర్కొన్నారు. చిరంజీవి చెంతన నటించడం జీవితంలో మరిచిపోలేని మధురానుభూతి అని పేర్కొన్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదలవుతుంది. అమలాపురం హైస్కూలు సెంటర్‌లో ఏర్పాటుచేసిన వస్త్ర దుకాణం దిగ్విజయంగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన వేడుకలకు సురభి శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రాజమహేంద్రవరం వచ్చానని ఇప్పుడు పచ్చని కోనసీమలో తొలిసారిగా అడుగు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కారులో వస్తూ కోనసీమ ప్రకృతి అందాలను తిలకించడం నా జీవితంలో ఓ మధురానుభూతి అని పేర్కొన్నారు.

కోనసీమ కథల పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, మార్చి 16: డాక్టర్ వేదుల శ్రీరామశర్మ సంకలనం చేసిన కోనసీమ కథలు పుస్తకాన్ని అమలాపురం శ్రీ కామాక్షీ పీఠ ప్రాంగణంలో శనివారం పీఠాధిపతి కామేశమహర్షి ఆవిష్కరించారు. ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోనసీమ కథలను డాక్టర్ పైడిపాల సమీక్షించారు. లబ్ద ప్రతిష్ఠులైన రచయితల రచనల్లోని అమూల్యమైన రత్నాలను ఏరికూర్చి కోనసీమ కథలను సంకలనం చేసిన శ్రీరామశర్మ కృషి అభినందనీయమని ముక్కామల చక్రధర్, డాక్టర్ సీవీ సర్వేశరశర్మలు కొనియాడారు. కార్యక్రమంలో సంస్కారభారతి జిల్లాశాఖ అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, వేదనభట్ల సాయిలక్ష్మి, శేర్ అనిల్‌కుమార్, అద్దంకి అమరేశ్వరరావు, జంపన సుమన్‌వర్మ, సీలి సంసోను పాల్గొన్నారు.

కుటుంబ సారధులు క్రియాశీలక పాత్ర పోషించాలి: వేగుళ్ల

రాయవరం, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల్లో కుటుంబ సాధికార సారధులు క్రియాశీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం చెల్లూరులో బూత్‌ఇన్‌చార్జ్‌లు, కుటుంబసాధికార సారధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదన్నారు. చుండ్రు వీర్రాజు, దేవు వెంకట్రాజు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

అమలాపురం రూరల్, మార్చి 16: జిల్లాలో ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు కవాతులు నిర్వహించాయి. అమలాపురం మండల పరిధిలోని చిందాడ గరువు, పేరూరు, కొత్తపేట పరిధిలోని అవిడి, కండ్రిగ, రాజోలు, శివకోడు, పొదలాడ, తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పలుచోట్ల గ్రామస్తులతో అవగాహన సదస్సులు నిర్వహించారు.

దేవకు వ్యతిరేకంగా బొంతు వర్గం ర్యాలీ



మలికిపురం, మార్చి 16: రాజోలు నియోజకవర్గ జనసేన అసెంబ్లీ అభ్యర్థిగా బొంతు రాజేశ్వరరావుకు అవకాశమివ్వాలని కోరుతూ శనివారం ఆయన వర్గీయులు టేకిశెట్టిపాలెం నుంచి మలికిపురం సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. దేవ వరప్రసాద్ గోబ్యాక్, స్థానికులకే టిక్కెట్లు ఇవ్వాలని, నాన్ లోకల్‌కు టిక్కెట్లు ఇవ్వరాదంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రాజోలు, మలికిపురం, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, మల్లిపూడి సత్తిబాబు మాట్లాడారు.

పారిశుధ్య కార్మికుల పిల్లలకు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు

అమలాపురం టౌన్, మార్చి 16: పారిశుధ్య పనులుచేసే కార్మికుల పిల్లలు 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఏప్రిల్ 10వ తేదీలోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులే. ఈ పథకం కింద మాన్యువల్ స్కావెంజర్స్, చర్మంతీసి శుద్ధి చేసేవారు. వ్యర్థాలు సేకరించేవారు. భూగర్భ పైపులైన్లు శుభ్రం చేసే కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలు పొందడానికి అర్హులన్నారు. ఏటా డే స్కాలర్లకు రూ.3వేలు, వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు రూ.8వేలు చొప్పున ఉపకార వేతనాలు చెల్లిస్తామన్నారు. ఈపథకానికి కుటుంబ ఆదాయ పరిమితి లేదు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సచివాలయ సిబ్బంది ద్వారా నవశకం లాగిన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు.

19న సీఎం జగన్ రాక

రావులపాలెం, మార్చి 16: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ రావులపాలెం ఈనెల19న రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక మార్కెట్ రోడ్డులోని వాకులరాజు విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు. బహిరంగ సభకు జనం తరలివచ్చే విధంగా సోషల్‌మీడియా వేదికగా ప్రచారం ప్రారంభించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: మాయ
వెంకటరమణ	: వెయ్ దరువెయ్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: తంత్ర
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భీమ

నేషనల్ లోక్‌అదాలత్‌లో 164 కేసులు పరిష్కారం

అమలాపురం టౌన్, మార్చి 16: అమలాపురం కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో రూ.1,88,92,578 విలువైన 164 కేసులు పరిష్కరించినట్టు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ తెలిపారు. నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 18 సివిల్ కేసులు, 95క్రిమినల్ కేసులు, 19 మోటారుయాక్సిడెంట్ కేసులు, 31 బీఎస్ఎన్ఎల్ కేసులు, 1 బ్యాంకు కేసును పరిష్కరించారు. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.హిమబిందు, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహతుల్లా ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈలోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కరించినట్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా పేర్కొన్నారు. మొత్తం రూ.44,20,597 అపరాధ రుసుముగా వసూలు చేసినట్టు జూనియర్ సివిల్ జడ్జి రహ్మతుల్లా తెలిపారు. లోక్‌అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాదరావు, ముమ్మిడివరం ఏజీపీ తిరుకోటి శాంతిసుధ, గ్రంధిరామారావు, నడింపల్లి సత్యనారాయణరాజు, జి.శ్రీనివాసరావు, కె.సింహాద్రివర్మ, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్.మునీశ్వరరావు, ఎం.అలీహుసన్, ముదే వెంకట్రావు, పి.నరేష్‌కుమార్, బ్యాంకు మేనేజర్లు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు న్యాయ సముదాయాల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 90 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రమీలారాణి, హిమబిందు తెలిపారు. బీఎస్ఎన్ఎల్, సివిల్, క్రిమినల్, బ్యాంకులకు సంబంధించి 90 కేసులకు రూ.84,11,643 ఆర్థిక లావాదేవీలు పరిష్కారమయ్యాయన్నారు. లక్ష్మీసుధ, రజిత పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ సమావేశానికి జిల్లా న్యాయవాదులు

అయినవిల్లి, మార్చి 16: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ సమావేశానికి జిల్లాకు చెందిన పలువురు న్యాయవాదులు హాజరైనట్టు పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు బదుగు భాస్కరజోగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీ జనరల్ ఎలక్షన్ సమ్మిట్ విజయవాడ లబ్బీపేటలో గల ఎస్ఎస్ కన్వెషన్ హాలులో శనివారం జరిగిందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జరగబోయే ఎన్నికల్లో లీగల్‌సెల్ నిర్వహించాల్సిన పాత్ర గురించి వివరించారన్నారు. ఎం.అచ్యుత్, ఎ.సురేష్, కె.తాతంరాజు, సీహెచ్ అజయ్‌కుమార్, ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.శ్రీనివాస్, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడిపై చాకుతో దాడి

రాయవరం, మార్చి 16: రాయవరంలో యువకుడిపై చాకుతో దాడి చేశారు. ఒక మహిళ విషయంలో ఇద్దరు యువకుల మధ్య గురువారం గొడవ జరిగింది. ఈనేపథ్యంలో రాయవరానికి చెందిన రోహిత్, అతని స్నేహితుడు సబ్బెళ్ల మురళికృష్ణారెడ్డి కలిసి కొమరిపాలేనికి చెందిన పోర్ని శివదుర్గారావుపై దాడి చేశారు. దీంతో తన అన్నను ఎందుకు కొట్టారని దుర్గారావు తమ్ముడు అభి ఫోన్‌లో రోహిత్‌ను నిలదీశాడు. దుర్గారావు పిన్ని కొడుకు కాకినాడకు చెందిన బర్నికల శ్రీను, అభి, శ్రీను మరికొంత మంది రాయవరంలో పెట్రోల్ బంక్ సమీపంలో రోహిత్ వర్గంతో వాదనకు దిగారు. రోహిత్ చాకుతో బర్నికల శ్రీనుపై దాడి చేశాడు. రోహిత్ అక్కడి నుంచి పరారయ్యాడు. శ్రీనును కాకినాడ ఆసుపత్రికి తరలించారు. శివదుర్గారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐ శ్రీధర్‌బాబు, ఎస్ఐ నరేష్ పరిశీలించారు.

సభను విజయవంతం చేయండి


ఉప్పలగుప్తం, మార్చి 16: రాష్ట్రంలో ప్రజాపాలనకు నాంది పలికే చిలకలూరిపేట ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి అరవింద్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు ప్రజాగళం ద్వారా రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన సాధించేలా దిశానిర్దేశం చేస్తారన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలని సూచించారు.

వైభవంగా షిరిడీసాయి విగ్రహ ప్రతిష్ఠ



ఉప్పలగుప్తం, మార్చి 16: భీమనపల్లిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎంపీటీసీ నాగరత్నకుమారి దంపతులు నిర్మించిన షిరిడీసాయి మందిరంలో శనివారం బాబా పాలరాతి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సాయికోటి లిఖిత మహాయజ్ఞం, హోమ పూజలు నిర్వహించారు.అధికసంఖ్యలో సాయిభక్తులు సాయి సామూహిక సత్యవ్రతాల్లో పాల్గొన్నారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

సొసైటీ చైర్‌పర్సన్ పదవికి పీఎస్ రాజు రాజీనామా



ఆత్రేయపురం, మార్చి 16: స్థానిక మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్, వైసీపీ నేత పీఎస్ రాజు శనివారం పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ ఇచ్చిన సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ ఉన్నతాధికారులకు సమర్పించారు. రాజు వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ నేతలు కంగుతిన్నారు. ఇప్పటికే క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ర్యాలి మాజీ సర్పంచ్ వుల్లం రాజు వర్మ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం తీసుకున్నారు.

చిలకలూరిపేట సభను జయప్రదం చేయాలి

మలికిపురం, మార్చి 16: చిలకలూరిపేటలో ఆదివారం జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని మలికిపురంలో జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ సమావేశం పిలుపునిచ్చింది. శనివారం మలికిపురంలో జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాదళం సదస్సుకు వంద కార్లతో వెళ్లాలని తీర్మానించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, మాలే శ్రీనివాసనగేష్, అడబాల సత్యనారాయణ, రాపాక రమేష్‌బాబు, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

సోమేశ్వరంలో వైద్య శిబిరం

రాయవరం, మార్చి 16: సోమేశ్వరం ముసలమ్మతల్లి కేర్‌క్లబ్, కాకినాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పాడకు చెందిన లతా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం, జగ్గంపేట లైన్స్ ఐ ఆసుపత్రి వైద్యబృందం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మెడికోవర్ కాకినాడ బృందం సాధారణ వ్యాధులు, ఆర్థో సమస్యలపై పరీక్షలు నిర్వహించింది. 370మందికి పరీక్షలు నిర్వహించి 32మందిని శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 70మందికి కళ్లజోళ్లు అందజేశారు. లయన్స్‌క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్ మేడిశెట్టి వెంకటరమణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డి.రామ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ ఆరీఫ్, గరగ సోమన్న, సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, డాక్టర్ చింతపల్లి వాసు, ముసలమ్మతల్లి కేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు అందజేత

ద్రాక్షారామ, మార్చి 16:వెల్ల వేణుగోపాలసోమేశ్వరస్వామివారి ఆలయాల ప్రాంగణంలోని గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి 2.5కేజీల వెండిఆభరణాలు గ్రామానికి చెందిన ముత్యాల సత్యనారాయణ దంపతులు, కొమ్మిరెడ్డి వీర్రాఘవులు దంపతులందించారు.

రైతులు రుణాలు సకాలంలో చెల్లించాలి

అంబాజీపేట, మార్చి 16: సొసైటీల ద్వారా రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వ రాయితీలను పొందాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్‌లు అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు సత్యమోహన్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తొలుత సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు బడ్జెట్‌ను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం రైతులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ సుదాబత్తుల లక్ష్మీభార్గవి, డైరక్టర్లు నందెపు సూరిబాబు, గోసంగి గంగిశెట్టి, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, మైలా ఆనందరావు, పేరి శ్రీను, సుదాబత్తుల రాము, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.